# రాష్ట్రంలో 9,480 గ్రామ సచివాలయాలు: సీఎస్

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలో 13,550 గ్రామ పంచాయతీలుండగా 9,480 గ్రామ సచివాలయాలు ఏర్పాటు కానున్నాయని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం వెల్లడించారు. వీటిలో ఒకే గ్రామ పంచాయతీతో కూడిన గ్రామ సచివాలయాలు 6,168 కాగా, ఒకటికి మించిన పంచాయతీలతో 3,312 ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు తెలిపారు. గ్రామ సచివాలయాల ఏర్పాటు విధివిధానాలపై వివిధ ప్రభుత్వ శాఖలతో సీఎస్ గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. గ్రామ సచివాలయాల ఏర్పాటు, వాటి పరిధిలో పనిచేసే సంబంధిత శాఖల సిబ్బంది తదితర అంశాలపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖతో సమన్వయం చేసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. గ్రామ సచివాలయాల వ్యవస్థ ఏర్పాటుకు ఈ నెల 15న నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. అక్టోబరు 2 నుంచి గ్రామ సచివాలయాలు పని చేయడం ప్రారంభించాల్సి ఉంటుందని వివరించారు.